
# తస్మాత్ జాగ్రత్త

● కథానిక



❝ మనుషుల్ని నమ్మడం తప్పా? మనుషుల్ని నమ్మించి ద్రోహం చెయ్యడం తప్పా? ❞

బర్కత్‌పూరలో బస్టాప్‌లో నిల్చునున్నాడు రమేష్.

ఆఫీసు నుండి బయటకు రాగానే ఈ బస్‌స్టాప్‌లో అతనికి రోజూ కొంతసేపు డ్యూటీ తప్పదు. రోజూ కనీసం పది నిముషాలైనా ఇక్కడ ఎదుట చూపు అనివార్యం. ఇరవై నిముషాలు బస్సు ప్రయాణం. అరగంట అయితేగానీ ఆఫీస్ వదిలిన తర్వాత ఇంటికి చేరుకోలేడు.,

కొందరాఫీసు మిత్రులైతే, మరికొందరు బస్సు మిత్రులు!

ఎదురుగా నిల్చున్న వ్యక్తి నవ్వడంతో తనూ చిన్నగా నవ్వాడు రమేష్. ఈ మధ్య రెండు మూడు రోజుల నుంచి ప్రతీ రోజూ అతడిని బస్టాప్‌లో చూస్తున్నాడు. అతనూ తనని చూస్తున్న ట్లున్నాడు. అందుకే పలకరింపుగా నవ్వి వుంటాడు. అతడిని పలకరించడానికి రెండడుగులటువేశాడు రమేష్.

"మీరు తార్నాకాయేనా?" పలకరింపుగా అడిగాడు రమేష్.

"కాదండీ... సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంగ్లీష్ దగ్గర బస్‌స్టాప్..." జవాబిచ్చాడతను.

"నా పేరు రమేష్.. మీ పేరు?"

"నవీన్!"

బస్సు మిత్రులు కొందరున్నారు. ఇక్కడే కలుస్తుంటాం. బస్సెక్కే వరకూ కబుర్లు, ఇక్కడ మా సంభాషణలోకి రాని విషయమంటూ వుండదం డోయ్... రాజు, రవి ఇవాళింకా రాలేదు..."

"ఎక్కడో ట్రాఫిక్ జామ్ అయినట్లుంది.... పది నిముషాల నుంచి ఒక్క బస్సూ లేదు..."

"అవున్నిజమే..."

"మీకభ్యంతరం లేకపోతే ఎదురుగా వున్న ఆ ఇరానీ హోటల్లో 'వన్‌బైటు' టీ తాగి వద్దాం బస్సొచ్చేలోపు..."

అలాగే పదండి... ఇంతసేపూ మనం ఎదురు చూస్తున్నాం. ఒక్క బస్సూ రాలేదు. మనం అలా బయల్దేరగానే బస్సొస్తుంది చూడండి."

ఇద్దరూ రోడ్డు దాటారు.

హోటల్‌లోకి అడుగు పెడుతూ వెనక్కి చూసిన నవీన్ "మిరన్నట్లే అయింది. అదుగో అటు చూడండి బస్సొస్తోంది..."

రమేష్ కూడా అటు చూసాడు.

బస్సు స్టాప్‌లో ఆగింది.

"తర్వాతి బస్సులో వెళ్దాంలెండి". రమేష్‌తో పాటు నవీన్ కూడా హోటల్‌లో ఓ టేబుల్ ముందు కూలబడ్డాడు.

'వన్‌బైటు' టీ పూర్తయ్యేసరికి ఇద్దరూ మంచి మిత్రులులా మాట్లాడుకోసాగారు. సినిమాల దగ్గర ప్రారంభమైన కబుర్లు రాజకీయాలవైపు మళ్ళాయి.

ఎవరి అభిప్రాయాలు వాళ్ళవి!

ఎవరి వాదన వారిది!

రెండోవాళ్ళ మీద వాటిని రుద్దాలనే ఇద్దరి తాపత్రయం!

ఈ తాపత్రయంలోనే అసంకల్పితంగా బిల్లు చెల్లించి, బస్టాప్ వేపు వచ్చారు.

బస్సు వచ్చి ఆగడంతో మాటలు ఆగిపోయాయి. అందరూ బస్సు మీదకి ఎగబడ్డారు.

నిండు గర్భిణిలా బస్సు బయల్దేరింది.

మరో వారం రోజులు గడిచాయి. రమేష్, నవీన్ మరికొంత దగ్గరయ్యారు.

ఆరోజు బస్టాప్‌లోకి రాగానే "మీరు నాకో చిన్న సాయం చేసి పెట్టాలి" అడగలేక అడుగుతున్నట్ల డిగాడు నవీన్.

"దాన్దేముంది చెప్పండి..." రమేషు మొహమాట పడ్డాడు.

"ఏం లేదు... అదుగో ఆ బాంక్‌లో అకౌంటు ఓపెన్ చేస్తున్నాను. ఆ బాంక్‌లోనే అకౌంట్ వున్న వారెవరైనా ఇంట్రడక్షనివ్వాలన్నారు. మీ ఆఫీసూ ఇక్కడే కాబట్టి మీ అకౌంటూ అక్కడుండి వుండ వచ్చని మీరు ఇంట్రడక్షన్‌కి సైన్ చేస్తారేమోనని..."

"దానిదేముంది? తప్పకుండా సైన్ చేస్తాను. అకౌంట్ ఓపెనింగ్ ఫారమ్ తెచ్చారా?" అడిగాడు రమేష్.

అడిగిందే తడవుగా జేబులోంచి ఫారాల్ని తీసాడు నవీన్.

రమేష్ వాటి మీద సంతకం పెట్టడం, బస్సు రావడం ఒక్కసారే జరిగాయి.

రమేష్ చేతులోంచి కాగితాలందుకుని నవీనూ బస్సు వేపు కదిలాడు.

ఈ సంఘటన జరిగి రెండు నెలలు దాటింది.

ఆ రోజు అయిదు గంటలకి రమేష్ ఆఫీస్ నుంచి బయల్దేరుతున్నప్పుడు ఇద్దరు పోలీసులు వచ్చారు. "మీరేనా రమేష్" అంటూ.

తన కోసం పోలీసులు రావడమేమిటి కంగారు పడిపోయాడు రమేష్.

"ఎస్సైగారు మిమ్మల్ని వెంటబెట్టుకురమ్మన్నారు."

"నన్నా?"

"అవును మిమ్మల్నే..." వాళ్ళలా గట్టి గట్టిగా అరుస్తుంటే తన పరువు కాస్తా బజారు పాలైపో తుందనే భయంతో బిక్క చచ్చి "పదండి..." వాళ్ళ వెంటే బయల్దేరాడు రమేష్.

"మీ మిత్రుడు నవీన్ ఏడీ?" రమేష్‌ని చూస్తూనే కసిరినట్లడిగాడు ఎస్సై.

ఓ పది రోజుల నుంచి బస్టాప్‌లో కనిపిం చడంలేదండి..." అమాయకంగా జవాబిచ్చాడు రమేష్.

"బస్టాప్‌లో కలవకపోతేనేం, ఏ ఇంటి దగ్గరో కలుస్తూనే వుంటారుగా... మా వాళ్ళూ ఇప్పుడు నీతో వస్తారు. మీ మిత్రుణ్ణి, ఆ ఇరవై వేలని అప్పగించు."

"ఇరవై వేలేమిటండీ?" అంతా అయోమయంగా వుంది రమేష్‌కి.

"అంత అమాయకత్వం నటించకు... నా లాఠీకి పని చెప్పాల్సొస్తుంది." ఎస్సై మాటలకు భయపడి అతని కాళ్ళని చుట్టేశాడు రమేష్ "నాకేమీ తెలీదంటూ".

అతనికి, తనకి పరిచయం ఎలా అయిందో, ఎంతకాలమైందో కూడా పూసగుచ్చినట్లు చెప్పాడు.

సరిగ్గా ఆ సమయానికి అటుగా వెళ్తూ ఆప ద్బాంధవుడిలా బాస్ వెళ్తుంటే ఆయన దగ్గరకెళ్ళి బావురుమన్నాడు.

ఆయన కూడా రమేష్ అలాంటివాడు కాదని నచ్చచెప్పడంతో ఎస్సై ఆలోచనలో పడ్డాడు.

"ఇంతకీ ఏమీ జరిగింది?" ఆఫీసర్ ఆరాతీ యడం ప్రారంభించాడు.

"మీ ఆఫీస్ ఎదురుగా వున్న బాంక్‌లో ఒకాయన రెండు నెలల క్రితం అకౌంట్ ఓపెన్ చేశాడు నవీన్‌నంటూ. ఓ ఇరవై వేల డిమాండ్ డ్రాఫ్టని అకౌంట్‌లో వేసి, విత్‌డ్రా చేసుకున్నాడు. ఆ తర్వాత మాకు రిపోర్ట్ వచ్చింది– నవీన్ అనే ఆయన డి.డి. కొరియర్‌లో మిస్సయిందని, కానీ అవతల కంపె నీవాళ్ళు పంపామంటూ నెంబరు కూడా ఇచ్చారనీ, కలెక్షన్. వివారాల్ని బట్టి ఈ బాంక్‌లోనే డిపాజిట్ అయిందని తెలిసింది. బాంక్‌లో అడ్రసు తీసుకొని ఆ నవీన్ ఇంటికి వెళ్ళాం. అది తప్పుడు అడ్రసు. అక్కడ ఎవ్వరూ నవీన్ అని లేరు. దాంతో మాకు అర్ధమైంది అది మోసమని, అకౌంట్ ఓపెనింగ్‌కి ఇంట్రడక్షన్ సైన్ ఎవరు చేశారోనని చూసాం. ఈయన చేశారు..." విషయం ఆఫీసర్‌తోపాటు రమేష్‌కీ అర్ధమైంది.

"సార్... అతనడిగింది సూరిటీ కాదు కేవలం ఇంట్రడక్షనే కదా అనుకున్నాగానీ దాని తోనూ ఇలాంటి మోసం చేస్తాడని నేనూహించలేదు సార్..." బావురుమన్నాడు రమేష్.

"ఇతను అమాయకుడు. రక్షించండి" అంటూ ఆఫీసర్ కూడా అభ్యర్థించడంతో చల్లబడ్డాడు ఎస్సై.


"చదువుకున్న వాళ్ళు మీరే ఇలా ఎక్కడ సంతకం పెట్టమంటే అక్కడ పెట్టేస్తే ఎలాగండి? ఆ ఇరవై వేలు బాంక్‌లో కట్టేయండి. కేసు కాకుండా చూస్తాను. మళ్ళీ ఎప్పుడూ ఇలా ఎవరు పెట్టమంటే వాళ్ళకి సంతకాలు పెట్టకండి." మందలిస్తూనే అభయాన్ని ఇచ్చాడు ఎస్సై.

బ్రతుకు జీవుడా అంటూ ప్రస్తుతానికి పోలీస్ స్టేషన్ నించి బయటపడ్డ రమేష్ తలవాచిపోయింది ఆఫీసర్‌గారి చివాట్లతో.

## సొంత ఇల్లు

మోడల్ నుండి హీరోయిన్ అవతారమెత్తిన సోనాలిబెంద్రే సినిమాలు వరుసగా తెగ సైన్ చేసింది. అందులో ఒక్కటి కూడా హిట్టవ్వలేదు. ఇలా ఎడపెడా సంతకాలు చేస్తేగాని బొంబాయిలో సొంత ఇల్లు కొనుక్కోలేం కదా అందుకే. ఇప్పుడు ఇల్లు కొనుక్కున్నా కాబట్టే నెమ్మదిస్తా అంటోంది సోనాలి బెంద్రే.






MAM/NCL/43